క్లుప్తంగా

రైతు సంక్షేమమే లక్ష్యం

బాటసింగారం రైతు సేవా సహకార సంఘం చైర్మన్ భరత్‌కుమార్



ఆర్థికసహాయం అందిస్తున్న భరత్‌కుమార్

అబ్దుల్లాపూర్‌మెట్: ప్రతి రైతు సంక్షేమమే ధ్యేయంగా సేవలందిస్తున్నామని బాటసింగారం రైతు సేవా సహకార సంఘం చైర్మన్ భరత్‌కుమార్ అన్నారు. సంఘంలో సభ్యత్వం ఉండి మృతి చెందిన సభ్యుల కుటుంబాలకు సంఘం ద్వారా రూ.25వేల నగదు అందజేస్తున్నామన్నారు. తారమతిపేట గ్రామానికి చెందిన ఎం.మల్లయ్య జనవరి 8వ తేదీన మృతి చెందడంతో ఆయన భార్య అంజమ్మకు సంఘం కార్యాలయంలో చైర్మన్ భరత్‌కుమార్ చేతుల మీదుగా గురువారం రూ.25వేల నగదును అందజేశారు. సహకార సంఘం సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ ఐలేష్‌యాదవ్, నాయకులు మల్లేశ్, యాదయ్య, బాలరాజుగౌడ్ పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా జగన్



ఆమనగల్లు: ఆమనగల్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మల్లెపల్లి జగన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆమనగల్లులో కోర్టు ఏర్పడిన అనంతరం బార్ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించిడం ఇదే తొలిసారి. గురువారం నిర్వహించిన ఎన్నికల్లో.. ఎన్నికల నిర్వహణాధికారిగా సీనియర్ న్యాయవాది లక్ష్మణ్‌శర్మ వ్యవహరించారు. న్యాయవాదులందరి సమక్షంలో బార్ అసోసియేషన్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మల్లెపల్లి జగన్, ఉపాధ్యక్షుడిగా సుధాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఆంజనేయులు యాదవ్, సంయుక్త కార్యదర్శిగా రామకృష్ణ, లైబ్రరీ కార్యదర్శిగా శేఖర్, కోశాధికారిగా మధును ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు జానకీరాములు యాదవ్, యాదీలాల్, మల్లేశ్‌గౌడ్, విజయ్‌కుమార్, కృష్ణ, మల్లేశ్, దేవేందర్, గణేశ్, బిక్యానాయక్, మురళీకృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం బార్‌అసోసియేషన్ ఎన్నిక



నూతన కమిటీ సభ్యులు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం అడ్వకేట్ బార్ అసోసియేషన్ ఎన్నికలను గురువారం నిర్వహించారు. ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా అంజన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా రమేష్, ప్రధాన కార్యదర్శిగా మహేందర్, సహాయ కార్యదర్శిగా ధనుంజయ్, కల్చరల్ సెక్రటరీగా గణేష్, లైబ్రరియన్‌గా భాస్కర్, ట్రెజరర్‌గా జగన్, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా జే.జగన్, జంగయ్య ఎన్నికైనట్లు తెలిపారు.

చామల గెలుపు ఖాయం

కాంగ్రెస్ నేత వెంకట్‌రెడ్డి



చామలకు శుభాకాంక్షలు తెలుపుతున్న వెంకట్‌రెడ్డి తదితరులు

యాచారం: భువనగిరి ఎంపీగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చామల కిరణకుమార్‌రెడ్డి గెలుపు ఖాయమని ఆ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు ముత్యాల వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. చామలకు ఎంపీ టికెట్ ప్రకటించిన సందర్భంగా నగరంలోని ఆయన నివాసంలో గురువారం వెంకట్‌రెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో చామల కిరణ కుమార్‌రెడ్డికి అత్యధిక మెజార్టీయే లక్ష్యంగా పనిచేస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మంతన్‌గౌరెల్లి మాజీ ఎంపీటీసీ సభ్యుడు కొర్ర అరవింద్‌నాయక్, నాయకులు మధుకర్, అఖిల్‌ఖాన్, సంతోష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

సీఐ శంకర్ కుమార్

యాచారం: లోక్‌సభ ఎన్నికల కోడ్ నేపథ్యంలో సాగర్ రోడ్డుపై యాచారం పోలీసులు వాహనాల తనిఖీలను ముమ్మరం చేశారు. యాచారం, గునుగల్, చింతపట్ల, మాల్ తదితర గేట్ల వద్ద గురువారం కార్లు, ఇతర వాహనాలను నిలిపి క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే వదులుతున్నారు. నింబంధనలు తప్పక పాటించాలని, అతిక్రమిస్తే చర్యలు తప్పవని సీఐ శంకర్ కుమార్ హెచ్చరించారు.

కల్యాణం.. కమనీయం

- వైభవంగా వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు
- వేడుకలకు హాజరైన టీఎస్‌పీఎస్‌సీ చైర్మన్ మహేందర్‌రెడ్డి



పూజలు చేస్తున్న టీఎస్‌పీఎస్‌సీ చైర్మన్ మహేందర్‌రెడ్డి తదితరులు

తలకొండపల్లి: మండల పరిధిలోని దేవుని పడకల్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయ బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆలయంలో కొలువైన శ్రీ భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరుడి కల్యాణంను గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా బ్యాండు మేళాలతో శ్రీ వేంకటేశ్వరస్వామి విగ్రహాన్ని ఆలయ ప్రాంగణం నుంచి గాలి గోపురం వరకు ఊరేగించారు. వేద పండితులు శ్రీమాన్ తిరుమల వింజమూరి రామానుజాచార్యులు, ఆదిత్యాచార్యులు, రామాచారి, పద్మనాభచార్యులు, శ్రీవాత్సవ మంత్రోచ్ఛరణ మధ్య ఉత్సవ విగ్రహాలను కల్యాణ మండపం వద్దరు తీసుకువచ్చారు. ఆలయ చైర్మన్ లట్టుపల్లి రాజుకుమార్‌రెడ్డి దంపతులు సమకూర్చిన పట్టు పీతాంబుర వస్త్రాలను దేవాతా మూర్తులకు ధరింపజేశారు. స్వామి కల్యాణానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వేడుకలకు టీఎస్‌పీఎస్‌సీ చైర్మన్ మహేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఫౌండరీ, ట్రస్టు చైర్మన్ రాజ్‌కుమార్, కార్యవర్గ సభ్యులు మధుసూదన్‌రెడ్డి, మధుకుమార్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కేశవరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీశైలం, ఉప సర్పంచ్ తిరుపతి, ఈఓ స్నేహలత, అసిస్టెంట్ రమాదేవి, క్లర్క్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



ఉత్సవాలను తిలకిస్తున్న భక్తులు



స్వామివారి ఊరేగింపు

నీటిని పొదుపుగా వాడుదాం

గాంధేయన్ విద్యాసంస్థల చైర్మన్ రాజేందర్‌రెడ్డి



ఇంకుడుగుంతలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న రాజేందర్‌రెడ్డి

హయత్‌నగర్: జీవ జాతికి ప్రాణాధారమైన నీటిని పొదుపుగా వాడుకోవాలని గాంధేయన్ విద్యాసంస్థల చైర్మన్ గున్న రాజేందర్‌రెడ్డి అన్నారు. జాతీయ జల దినోత్సవాన్ని పురస్కరించుకుని జలమండలి, గాంధీ జ్ఞాన్‌ప్రతిష్టాన్ ఆధ్వర్యంలో గురువారం పెద్ద అంబర్‌పేట్ మున్సిపాలిటీ కుంట్లూర్‌లో ఉన్న గాంధేయన్ కళాశాలలో.. నీటి వాడకం, సంరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. నగరాలు కాంక్రీట్‌తో నిండిపోవడ వలన వర్షపు నీరు భూమిలోకి ఇంకడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నీటిని రక్షించేందుకు ఇంకుడుగుంతల నిర్మాణం ఉత్తమమైన మార్గమని.. అవకాశం ఉన్న ప్రతిచోట 40 రకాలుగా ఇంకుడు గుంతలు నిర్మాణం చేయవచ్చ పేర్కొన్నారు. నీటి సంరక్షణపై విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో గాంధీ విద్యా సంస్థల వైస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ కృష్ణయ్య, ప్రేమ్‌కుమార్, నాయకులు శివారెడ్డి, ప్రణీత్ కుమార్‌రెడ్డి, చైతన్యరెడ్డి, బార్గవ్, సతీష్, సాయి, రఘురాం తదితరులు పాల్గొన్నారు.

సేవలను సద్వినియోగం చేసుకోవాలి

లిమ్స్ ఎండీ విశ్వనాథ్



ఎండీ విశ్వనాథ్‌ను సన్మానించిన సిబ్బంది

ఇబ్రహీంపట్నం: లాభాపేక్ష లేకుండా గ్రామీణ పేదలకు వైద్య సేవలు అందించాలని లిమ్స్ ఎండీ విశ్వనాథ్ అన్నారు. ఇబ్రహీంపట్నంలోని లైఫ్ కేర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ ఆస్పత్రి 3వ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి హాజరైన విశ్వనాథ్ మాట్లాడుతూ.. అత్యాధునిక పరికరాలతో అతి తక్కువ ధరలో పేదవారికి వైద్య సేవలను అందిస్తున్న ఆస్పత్రి లిమ్స్ అని తెలిపారు. ఉచితంగా హెల్త్ చెకప్‌లు నిర్వహిస్తూ గ్రామీణ ప్రాంత ప్రజలకు లిమ్స్ తమ సహకారాన్ని అందిస్తుందన్నారు. ఇక్కడి సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా లిమ్స్ సిబ్బందితో కలిసి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు దినేష్, రాంరాజ్, నరేష్, అభిలాష్, లౌక్య, గౌతమ్, మేనేజర్ బాషా, సిబ్బంది సతీష్, శివ, ఖాదర్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రానివ్వం



తాగునీటి సమస్యపై సమీక్షలో పాల్గొన్న అధికారులు

మంచాల: గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు. మంచాల గ్రామంలో తాగునీటి సమస్యపై గురువారం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సమీక్ష నిర్వహించిన అనంతరం వారు మాట్లాడుతూ.. మంచాలలో ప్రస్తుతం ఎలాంటి తాగునీటి ఇబ్బందులు లేవని, భవిష్యత్‌లో కూడా రాకుండా చూస్తామని పేర్కొన్నారు. పాడైపోయిన మోటార్ల రిపేర్, పైపులైన్ల లీకేజీలు వంటి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో ప్రజలకు నీటిఎద్దడి రానివొద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ నర్సింహులు, డీఈఈ రాజు, ఏఈఈ స్రవంతి, ఈఓఆర్డీ తేజ్‌సింగ్, మిషన్ భగీరథ ఏఈఈ అనిరుధ్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో వందశాతం పోలింగ్



కల్వకుర్తిలో ఓటు వేసిన ఎమ్మెల్యే కసిరెడ్డి, నాయకులు



షాద్‌నగర్‌లో ఓటు వేయడానికి వెళ్తున్న మాడ్గుల ప్రజాప్రతినిధులు

- ప్రశాంతంగా మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ ఉపఎన్నిక
- గెలుపుపై ఎవరి ధీమా వారిదే

ఆమనగల్లు: మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీకి గురువారం జరిగిన ఉపఎన్నికలో ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు అందరూ ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఉప ఎన్నికకు సంబంధించి ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాల ప్రజాప్రతినిధులు ఓటు వేయడానికి షాద్‌నగర్ ఎంపీడీఓ కార్యాలయంలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ పోలింగ్ కేంద్రానికి నాలుగు మండలాలకు చెందిన బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు గోవా నుంచి నేరుగా చేరుకున్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు షామీర్‌పేట్‌లోని రిసార్ట్స్ నుంచి పోలింగ్ కేంద్రానికి వచ్చారు. ఆయా పార్టీల ప్రజాప్రతినిధులు మధ్యాహ్నానికే తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆమనగల్లు నుంచి 21 మంది, మాడ్గుల నుంచి 15, కడ్తాల నుంచి 11, తలకొండపల్లి నుంచి 13 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎమ్మెల్యే కసిరెడ్డి కల్వకుర్తిలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు. నియోజకవర్గం నుంచే కాకుండా మొత్తంగా 100 శాతం పోలింగ్ నమోదైనట్లు సమాచారం.



షాద్‌నగర్‌లో ఓటు వేసిన కడ్తాల ప్రజాప్రతినిధులు

వివాహానికి ఆర్థికసాయం అందజేత

తలకొండపల్లి: మండల పరిధిలోని పెద్దూర్ తండాకు చెందిన మెగావత్ బద్యా నాయక్ కూతురికి వివాహం నిశ్చయమయ్యింది. పెళ్లి ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయాన్ని అందజేసి ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్‌రెడ్డిని కోరారు. వెంటనే స్పందించిన ప్రభాకర్‌రెడ్డి గురువారం పెద్దూర్ తండాకు వెళ్లి వివాహానికి రూ.10,000 ఆర్థిక సహాయం అందజేశారు. వివాహాన్ని ఘనంగా జరిపించాలని కోరారు. శ్రీను, చందర్, కృష్ణ, భాస్కర్, హీరాలాల్,సరేందర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీటీసీ వెంకటేశ్ ఆధ్వర్యంలో..

జిల్లాలోని కేశంపేట్ మండలం తులవాని గడ్డ గ్రామానికి చెందిన శృతి వివాహం జరుప నిశ్చయించారు. పెళ్లికి ఆర్థిక సహాయం అందజేసి ఆదుకోవాలని ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ వెంకటేశును అమ్మాయి తల్లిదండ్రులు సుక్కయ్య, సుగుణమ్మ కోరారు. స్పందించిన జెడ్పీటీసీ శృతి గురువారం హైదరాబాద్‌లో ట్రస్టు సభ్యులచే రూ.15,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బుచ్చిబాబు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

నేడు గ్రేట్ బాంబే సర్కస్ ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న నిర్వాహకులు సంజీవ్, సంపత్

వనస్థలిపురం: ప్రఖ్యాతి గాంచిన గ్రేట్ బాంబే సర్కస్ శుక్రవారం వనస్థలిపురం ఆటోనగర్‌లో ప్రారంభమవుతుందని, ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై సర్కస్‌ను ప్రారంభిస్తారని నిర్వాహకులు సంజీవ్, సంపత్ తెలిపారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ, ఎన్నో ఏళ్ల తర్వాత ఆటోనగర్‌లో సర్కస్ తిరిగి ప్రారంభం కానుందని, సర్కస్‌లో ట్రామ్పోలిన్, ఎక్సోటిక్ డాగ్ షో, కాలిక్యులేటింగ్ డాగ్, ఫ్లయింగ్ ట్రాపెజ్, ఫైర్ డ్యాన్స్, స్కైవాక్, రోలర్ బ్యాలెన్స్, రోలర్ స్కేటింగ్, విదూషకుల షో తదితర ఎన్నో విన్యాసాలు ఉన్నాయని అన్నారు. సర్కస్‌లో ప్రతి రోజూ మధ్యాహ్నం ఒంటి గంటకు, సాయంత్రం 4 గంటలకు, రాత్రి 7 గంటలకు షోలు ఉంటాయని అన్నారు.

30న 'రన్‌ఫర్ జీసెస్'

మలక్‌పేట: గుడ్ ఫ్రైడే సందర్భంగా ఈనెల 30న రన్ ఫర్ జీసెస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మలక్‌పేట క్రిస్టియన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సాల్మన్‌రాజ్, మలక్‌పేట నియోజకవర్గ పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మాణిక్యం అబ్రహం తెలిపారు. శనివారం ఉదయం 6 గంటలకు దిల్‌సుఖ్‌నగర్ బాప్టిస్టు చర్చి నుంచి బైక్ ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు. మూసారంబాగ్ చౌరస్తా మీదుగా అక్బర్‌బాగ్ సర్కిల్, హోరేబు చర్చి, సైదాబాద్, గవర్నమెంట్ ప్రెస్ మీదుగా నల్లగొండ క్రాస్‌రోడ్‌లోని ఎంబీ చర్చి వరకు కొనసాగుతుందన్నారు.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడి



అవగాహన సదస్సులో పాల్గొన్న శాస్త్రవేత్తలు

వ్యవసాయ శాస్త్రవేత్తలు చంద్రకాంత్, విజయ్, శ్రీకృష్ణ

మంచాల: ఆధునిక పద్ధతిలో పంటలను సాగు చేసి అధిక దిగుబడిని పొందాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు చంద్రకాంత్, విజయ్, శ్రీకృష్ణ అన్నారు. గురువారం మంచాల మండలంలోని చాంద్‌ఖాన్‌గూడలో వాటర్ సంస్థ ఆధ్వర్యంలో రైతులకు పంటల సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. పంటల సాగు విషయంలో వస్తున్న మార్పులను గమనించడంతో పాటు తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి వచ్చే పంటలను సాగు చేయాలన్నారు. అదే విధంగా కృత్రిమ ఎరువుల వాడకం బదులుగా సేంద్రియ ఎరువుల వాడకంపై శ్రద్ధ తీసుకోవాలన్నారు. నానో టెక్నాలజీ సంస్థ నానో యూరియా, నానో గ్రోమోరు వంటి మందులను తీసుకొని వచ్చిందని.. వాటిని పంటల సాగుకు ఉపయోగించాలన్నారు. వ్యవసాయ పంటల సాగు విషయంలో డ్రోన్ వాడకంపై రైతులకు ప్రత్యేక అవగాహన కల్పించారు. వాటర్, ఇఫ్కో సంస్థల సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఇఫ్కో ఫీల్డ్ మేనేజర్ చంద్రన్న, వాటర్ సంస్థ ప్రతినిధి కృష్ణ, వ్యవసాయ విస్తరణాధికారి సరిత, వాటర్ సంస్థ సిబ్బంది జంగయ్య, రజిత, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

చెత్తకు నిప్పు!



సిర్లాహిల్స్‌లో ఇళ్ల మధ్య చెత్తకు నిప్పంటించడంతో వస్తున్న పొగ

ఇళ్ల మధ్యే తగలబెడుతున్నారు

- పొగతో ఉక్కిరిబిక్కిరి
- నిబంధనలు బేఖాతరు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న కాలనీవాసులు
- పట్టించుకోని అధికారులు

మీర్‌పేట: ఇంటి పరిసరాల్లో వెలువడే చెత్తను పేర్చి తగులబెడుతున్నారు. దీంతో కాలనీ వాసులు ఉక్కిరి బిక్కిరవుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలో మున్సిపల్ సిబ్బంది చెత్తను సేకరించి తరలించాలి. కానీ కొందరు అక్కడ చేరిన చెత్త, చెదారాన్ని కుప్పగా చేసి మంట పెట్టడంతో కాలనీ వాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చెత్త తగులబెట్టొద్దన్న నిబంధనలు ఉన్నప్పటికీ వాటిని బేఖాతరు చేస్తున్నారు. ఈ విషయంలో శానిటేషన్ అధికారులు పట్టించుకోకపోవడంతోనే సమస్య ఉత్పన్నమవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బస్తీల్లో..

నిర్మానుష్య ప్రాంతాలతో పాటు ఇండ్ల మధ్య, కాలనీలు, బస్తీల్లోని ఖాళీ ప్రదేశాల్లో ఉదయం చెత్తను సేకరించి కాల్చేస్తున్నారు. దీంతో పెద్ద ఎత్తున పొగ వెలువడి ఇళ్లలోకి వ్యాపించడంతో ఊపిరితీసుకోవడం ఇబ్బందికరంగా మారుతుంది. దాదాపు గంట నుంచి రెండు గంటల పాటు పొగ వస్తుండడంతో చేసేది లేక మండుతున్న చెత్తమీద నీటిని పోసి ఆర్పాల్సిన దుస్థితి నెలకొందని పలువురు పేర్కొంటున్నారు.

పోలీస్‌స్టేషన్‌కు వెళ్లే దారిలోనే..

మీర్‌పేట పోలీస్‌స్టేషన్‌కు వెళ్లే దారిలో సిర్లాహిల్స్ కాలనీలోని ఖాళీ స్థలం ఉంది. అక్కడ నిత్యం చెత్తను తగులబెడుతున్నారని, చుట్టూ నివాసా ప్రాంతాలు ఉన్నప్పటికీ ఈ విషయాన్ని ఎవరూ పట్టించుకోవడం లేదు. అక్కడే స్టేషన్‌కు వచ్చే వాహనాలతో పాటు స్థానికులు తమ వాహనాలను పార్క్ చేస్తుంటారు. అసలే వేసవి కావడంతో తరచూ చెత్తకు మంట పెట్టడంతో అగ్ని ప్రమాదం చోటు చేసుకునే అవకాశం లేకపోలేదని కాలనీ వాసులు భయపడుతున్నారు. ఏదైనా అనుకోని ప్రమాదం సంభవిస్తే పెద్ద ఎత్తున నష్టం వాటిల్లొచ్చని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే శానిటేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

కాలనీల్లోని కొన్ని ప్రాంతాల్లో చెత్త తగులబెడుతున్నట్లు నా దృష్టికి వచ్చింది. ఈ సమస్య పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటాం. అదే విధంగా కాలనీలు, బస్తీల్లో చెత్తను ఎప్పటికప్పుడు తరలించేలా చూస్తాం.

– రమేశ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్

31న సర్వసభ్య సమావేశం

అబ్దుల్లాపూర్‌మెట్: బాటసింగారం రైతు సేవా సహకార సంఘం 54వ సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం సంఘం కార్యాలయంలో చైర్మన్ చేగూరి భరత్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు మేనేజర్ ఐలేష్‌యాదవ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి డైరెక్టర్లతో పాటు సంఘం పరిధిలోని రైతులు, సభ్యులు, ఖాతాదారులు హాజరుకావాలని కోరారు.

పాండురంగారెడ్డికి సన్మానం



పాండు రంగారెడ్డిని సన్మానించిన నేతలు

ఇబ్రహీంపట్నం: ఉప్పరిగూడ పీఏసీఎస్ చైర్మన్‌గా ఎన్నికైన పాండు రంగారెడ్డిని గురువారం కాంగ్రెస్ శ్రేణులు కలిసి అభినందనలు తెలిపారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు ముత్యాల రాజశేఖర్‌రావు, సీనియర్ నాయకులు రమేష్, నాగేశ్, సంతోష్‌కుమార్, భానుచందర్, భానుప్రసాద్ తదితరులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఆయన మరిన్ని పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు.

ఎన్టీఆర్‌నగర్‌లోని పేదల ఇళ్లను రెగ్యులరైజ్ చేయాలి

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్‌లోని ఎన్టీఆర్ నగర్‌లో పేదల ఇళ్లను వెంటనే రెగ్యులరైజేషన్ చేయాలని ది అర్బన్ హట్స్, స్లమ్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ ట్విన్ సిటీస్ ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఇస్మాయిల్, ఇతర నాయకులు గురువారం చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డికి కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో బస్తీవాసులు మధు మహరాజు, పదిరే శంకర్ తదితరులు పాల్గొన్నారు.